# ప్రజా మారుతి
తెలంగాణ జాతీయ దినపత్రిక
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు





పదేళ్లలో చంద్రుడిపై అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని రష్యా యోచన


ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 174 పేజీలు : 04 వెల రూ. 2 గురువారం 25 - 12 - 2025


## కొత్త సర్పంచ్‌లకు తీపి కబురు
# గ్రామాలకు ప్రత్యేకంగా రూ.10లక్షలు

- నూతన సంవత్సరంలో గ్రామాలకు సీఎం రేవంత్ రెడ్డి వరాల జల్లు
- నారాయణపేట జిల్లా కోస్గిలో సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమానికి హాజరైన సీఎం
- నూతన సంవత్సరంలో గ్రామాలకు ప్రత్యేక అభివృద్ధి నిధులు ఇస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి
- కొడంగల్‌ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని వెల్లడి
- యథావిధిగా వచ్చే నిధులు కాకుండా చిన్న గ్రామాలకు రూ.5లక్షలు, పెద్ద గ్రామాలకు రూ.10లక్షలు
- ముఖ్యమంత్రి నిధి నుంచి ప్రత్యేక అభివృద్ధి నిధులు(స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్) కేటాయిస్తామని ప్రకటించారు
- కొడంగల్ నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు



నూతన సంవత్సరంలో పల్లెలకు ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. గ్రామ పంచాయతీలకు యథావిధిగా వచ్చే నిధులు కాకుండా చిన్న గ్రామాలకు రూ.5లక్షలు, పెద్ద గ్రామాలకు రూ.10లక్షలు చొప్పున ముఖ్యమంత్రి నిధి నుంచి ప్రత్యేక అభివృద్ధి నిధులు(స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్) కేటాయిస్తామని ప్రకటించారు. శాసన సభ్యులు, ఎంపీలు, మంత్రులతో సంబంధం లేకుండా ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. నారాయణపేట జిల్లా కోస్గిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు గ్రామాల్లో సదుపాయాల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని - మిగతా 2 లో

## విద్యార్థులు లేని 'జీరో' పాఠశాలలపై తెలంగాణ కీలక నిర్ణయం

2 లో

- ఈ పాఠశాలలను తాత్కాలికంగా మూసివేయనున్న పాఠశాల విద్యాశాఖ
- ఒక్క విద్యార్థి లేని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ స్థానంలో తెలంగాణ
- 1,441 పాఠశాలలను తాత్కాలికంగా మూసివేసిన విద్యా శాఖ
- ఆయా ప్రాంతాల్లో తల్లిదండ్రులు కోరితే తెరవడానికి సిద్ధమన్న విద్యాశాఖ

## బీఆర్ఎస్ గతం
# కాంగ్రెస్సే భవిష్యత్తు

- నేను రాజకీయాల్లో ఉన్నంత వరకు కల్వకుంట్ల కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వను
- ఇదే నా శపథం
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్
- కొడంగల్ బిడ్డగా ఇదే గడ్డ మీది నుంచి చెబుతున్నానని సవాల్
- బీఆర్ఎస్ గతం కాంగ్రెస్ భవిష్యత్తు అన్న రేవంత్ రెడ్డి
- కేసీఆర్ నన్ను జైలుకు పంపించి నా కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టాడని వ్యాఖ్య
- ఇక బీఆర్ఎస్ గతమేనని, భవిష్యత్తు కాంగ్రెస్ మాత్రమే అన్నారు



కొడంగల్ బిడ్డగా ఇదే గడ్డ మీది నుంచి ఒక మాట చెబుతున్నానని, తాను రాజకీయాల్లో ఉన్నంత వరకు కేసీఆర్ సహా కల్వకుంట్ల కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వనని, ఇదే తన శపథమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా కోస్గిలో ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి రానివ్వనని, ఇదే తన సవాల్ అన్నారు. ఇక బీఆర్ఎస్ గతమేనని, భవిష్యత్తు కాంగ్రెస్ మాత్రమే అన్నారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 80కి పైగా సీట్లు సాధిస్తుందని, నియోజకవర్గాల పునర్విభజన జరిగి 153 - మిగతా 2 లో

# 'బాహుబలి' రాకెట్ ప్రయోగం విజయవంతం

- ఇస్రోకు ఏపీ గవర్నర్, సీఎం అభినందనలు
- శ్రీహరికోట నుంచి ప్రయోగించిన ఎల్వీఎం3-ఎం6 మిషన్ ఘన విజయం
- కక్ష్యలోకి చేరిన అత్యంత భారీ ఉపగ్రహంగా బ్లూబర్డ్ బ్లాక్-2 రికార్డు
- భారత వాణిజ్య అంతరిక్ష సామర్థ్యానికి అంతర్జాతీయ గుర్తింపు
- అత్యాధునిక కమ్యూనికేషన్ ఉపగ్రహమైన బ్లూబర్డ్ బ్లాక్-2ను కక్ష్యలోకి చేర్చిన ఈ ప్రయోగాన్ని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలు విజయవంతం చేశారు



శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈరోజు విజయవంతంగా ప్రయోగించిన ఎల్వీఎం3-ఎం6 మిషన్‌పై దేశవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. అత్యాధునిక కమ్యూనికేషన్ ఉపగ్రహమైన బ్లూబర్డ్ బ్లాక్-2ను కక్ష్యలోకి చేర్చిన ఈ ప్రయోగాన్ని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు విజయవంతం చేశారు. ఈ ఘన విజయంపై - మిగతా 2 లో

# ప్రధాని అభ్యర్థిగా ప్రియాంక గాంధీ!

- పేరును ప్రతిపాదించిన కాంగ్రెస్ ఎంపీ
- స్పందించిన బీజేపీ
- కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ గందరగోళంలో ఉంటుందన్న బీజేపీ అధికార ప్రతినిధి
- ఐఎన్ఎస్ అంటే 'ఐ నీడ్ కన్ఫ్యూజన్' అంటే బాగుంటుందని వ్యాఖ్య
- రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటకలలో కాంగ్రెస్ గ్రూపులు ఉన్నాయన్న పూనవాలా



కాంగ్రెస్ పార్టీ తరపున ప్రియాంక గాంధీ ప్రధానమంత్రి అభ్యర్థిగా ఉండాలనే చర్చపై బీజేపీ స్పందించింది. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ గందరగోళంలో ఉంటుందని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనవాలా విమర్శించారు. ఐఎన్ఎస్ అంటే సాధారణంగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అని కానీ ఈ పేరు కంటే 'ఐ నీడ్ కన్ఫ్యూజన్' అనే పేరు ఆ పార్టీకి బాగా సరిపోతుందని ఎద్దేవా చేశారు. జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీలో ముఠా రాజకీయాలు కనిపిస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా షెహజాద్ పూనవాలా పలు అంశాలను ఉదహరించారు. రాజస్థాన్‌లో సచిన్ పైలట్, అశోక్ గెహ్లోట్, హిమాచల్ ప్రదేశ్‌లో ప్రతిభా సింగ్, సుఖ్విందర్ సింగ్ సఖు, కర్ణాటకలో డీ.కే. శివకుమార్, సిద్ధరామయ్య ఇలా నేతల మధ్య గ్రూపులు ఉన్నాయని గుర్తు చేశారు. ఇప్పుడు జాతీయ స్థాయిలో రాహుల్ కాంగ్రెస్, ప్రియాంక - మిగతా 2 లో

## మూడు కొత్త ఎయిర్‌లైన్స్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్


2 లో

- ఇండిగో సంక్షోభం తర్వాత కేంద్రం కీలక నిర్ణయం
- దేశీయ విమానయాన రంగంలోకి మూడు కొత్త సంస్థలు
- శంఖ్ ఎయిర్, అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్‌ప్రెస్‌కు ఎన్ఓసీలు జారీ
- ఇటీవలి ఇండిగో సంక్షోభం నేపథ్యంలో పెరిగిన పోటీ ఆవశ్యకత
- విమానయాన రంగంలో గుత్తాధిపత్యాన్ని తగ్గించేందుకు కేంద్రం చర్యలు
- మరిన్ని సంస్థలను ప్రోత్సహిస్తున్నామని మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



- స్వయంగా వృద్ధురాలి ఇంటికి వెళ్లి ఆర్థికసాయం
- గుంటూరు జిల్లా ఇప్పటంలో పవన్ పర్యటన
- వృద్ధురాలు నాగేశ్వరమ్మకు రూ.50 వేలు, మనవడికి రూ.లక్ష ఆర్థికసాయం అందజేసిన పవన్
- నాగేశ్వరమ్మ మనవడి చదువుకు నెలకు రూ.5 వేలు చొప్పున పవన్ సాయం
- ఎన్నికల్లో గెలిచాక మళ్లీ రావాలని ఇండ్ల నాగేశ్వరమ్మ అనే వృద్ధురాలు ఆయన్ను కోరింది

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఇప్పటం గ్రామంలో పర్యటించారు. వృద్ధురాలు నాగేశ్వరమ్మ కొత్తగా నిర్మించుకున్న ఇంటికి ఆయన వెళ్లారు. పవన్‌కల్యాణ్‌ను నాగేశ్వరమ్మ దంపతులు ఆప్యాయంగా ఆహ్వానించారు. ఆ దంపతులను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న పవన్ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్సీపీ హయాంలో రోడ్డు విస్తరణ పేరుతో ఇప్పటంలో - మిగతా 2 లో

# చర్చించి 'విశాఖ రుషికొండపై నిర్ణయం'

- మంత్రివర్గ ఉపసంఘం
- వందల కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన రుషికొండ ప్యాలెస్ నిర్మాణాలను ఎలా ఉపయోగంలోకి తేవాలని మంత్రుల చర్చ
- వినియోగానికి ముందుకు వచ్చిన టాటా సహా పలు సంస్థలు
- రుషికొండ నిర్మాణాలపై మరో రెండు ఫ్లోర్లు వేసుకోవచ్చు
- రుషికొండ ప్యాలెస్ వినియోగంపై సబ్ కమిటీ భేటీ
- హాస్పిటాలిటీ ఇండస్ట్రీ కోసం వినియోగించే అంశాన్ని పరిశీలించామన్న కేశవ్
- గత వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన కందుల దుర్గేశ్



రుషికొండపై నిర్మించిన ప్యాలెస్‌ను ఎలా ఉపయోగంలోకి తేవాలన్న అంశంపై మంత్రివర్గ ఉపసంఘం మరోసారి తీవ్రంగా చర్చించింది. విశాఖలోని రుషికొండపై గత ప్రభుత్వం నిర్మించిన రాజభవనాలను వినియోగంలోకి తెచ్చే అంశంపై కూటమి ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. ఈ అంశంపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ ఆ ప్యాలెస్ లను వీలైనంత త్వరగా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఆ క్రమంలో కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయని వాటిని అధిగమించేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సచివాలయంలో రెండోబ్లాక్ లో మంత్రివర్గ ఉపసంఘం మూడో సారి సమావేశమైంది. ఇందులో మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, పాల్గొనగా, మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి - మిగతా 2 లో

## కేసీఆర్ వ్యాఖ్యలపై ఏపీ మంత్రి పార్థసారథి ఫైర్



- ఏపీకి వస్తున్న పెట్టుబడులపై కేసీఆర్ వ్యాఖ్యలను తప్పుబట్టిన పార్థసారథి
- ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే కుదరదని మండిపాటు
- రెండు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలనేదే చంద్రబాబు లక్ష్యమని వ్యాఖ్య

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ గురించి, ఏపీకి వస్తున్న పెట్టుబడుల గురించి కేసీఆర్ మాట్లాడిన తీరు అభ్యంతరకరమని మండిపడ్డారు. భాష, యాస, ప్రాసలపై పట్టు ఉందని ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే కుదరదని అన్నారు. విజయవాడ ప్రెస్ క్లబ్ లో జరిగిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఏపీకి వస్తున్న పెట్టుబడులపై మీకు ఏవైనా అనుమానాలు ఉంటే... వాటిని - మిగతా 2 లో

# సంపాదకీయం

## దిక్కుతోచని ఉక్రెయిన్



నెలలు గడుస్తున్నా రష్యా-ఉక్రెయిన్ యుద్ధ విరమణకు చేస్తున్న ప్రయత్నాలు ఒక కొలిక్కి రాకపోవటంతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అసహనం కట్టలు తెంచుకున్నట్టు కనబడుతోంది. మధ్యవర్తిగా తన ప్రతిపాదనలకు ససేమిరా అంటున్న ఉక్రెయిన్‌తోపాటు, దానికి దన్నుగా నిలబడిన యూరప్ దేశాలను కూడా ఆయన తూర్పార బడుతున్నారు. రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్ ఓడిపోతున్నదనీ, యూరప్ దేశాలు బలహీనంగా మారి క్షీణదశకు చేరుకున్నాయనీ ఆయన తాజాగా వ్యాఖ్యానించారు.వైరి పక్షాలు ఎటూ నువ్వా నేనా అన్నట్టు ఉంటాయి. మధ్యవర్తిత్వం వహించే దేశం ఓపిగ్గా వాస్తవ పరిస్థితులను అర్థం చేయించి ఏదోమేరకు తగ్గేలా చేయటం అవసరం. కానీ అలా చేయాలంటే మధ్యవర్తిత్వం వహించే దేశానికి విశ్వసనీయత, ప్రతిష్ఠ ఉండాలి. ట్రంప్ ఆగమనం తర్వాత అమెరికాకు ఆ రెండూ తగ్గాయి. ఏ విషయంలోనూ ఆయన నిలకడగా లేకపోవటం, ఇష్టానుసారం వ్యాఖ్యానిస్తూ అయోమయాన్ని సృష్టించటం కారణం. జో బైడెన్ హయాంలో అమెరికా ప్రాపకంతోనే యూరప్ దేశాలు ఉక్రెయిన్‌ను రష్యాపైకి ఉసిగొల్పాయి. కానీ ట్రంప్ వచ్చాక అంతా తలకిందులయి యూరప్ దేశాలకు దిక్కుతోచడం లేదు. అంతేకాదు, ఇటీవల జాతీయ భద్రతా వ్యూహం పేరిట అమెరికా విడుదల చేసిన విధాన పత్రం కూడా వాటికి మింగుడుపడటం లేదు. అట్లాస్ మాదిరిగా ఒంటరిగా భూగోళాన్ని మోయటం ఇకపై ఉండబోదనీ, యూరప్ స్వీయరక్షణ బాధ్యత చూసుకోవాలనీ ఆ పత్రం స్పష్టం చేసింది. ప్రపంచాధిపత్యం కోసం పోటీపడటం పర్యవసానంగా అమెరికా బలహీనపడిందనీ, అందుకే పాత విధానానికి అవసరమైన దిద్దుబాట్లు తప్పనిసరనీ తేల్చింది. ఇప్పటికి ఎనిమిది యుద్ధాలు ఆపానని తరచు చెప్పే ట్రంప్ జాబితాలో నిజానికి ఇప్పటికైతే ఉక్రెయిన్ లేదు. కానీ ఆయన అధికార పగ్గాలు చేపట్టిననాడే ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపుతానని శపథం చేశారు. 2014కు ముందున్న సరిహద్దుల సంగతి ఉక్రెయిన్ మర్చిపోవాలని చెబుతూ వచ్చారు. కానీ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తమ భూభాగాన్ని వదులుకోవటానికి ససేమిరా అంటున్నారు. నిజానికి 2022లో ఉక్రెయిన్‌కూ, ఆయనకు మద్దతునిస్తున్న యూరప్ దేశాలకూ బంగారం లాంటి అవకాశం వచ్చింది. టర్కీ మధ్యవర్తిత్వంలో రష్యా, ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చల్లో రష్యా తనకు తానే రాజీకి సిద్ధపడింది. ఉక్రెయిన్ తటస్థంగా ఉంటాననీ, నాటోలో చేరబోననీ హామీ ఇస్తే దురాక్రమించిన భూభాగం నుంచి వైదొలగుతామని రష్యా ప్రతినిధి బృందం ప్రతిపాదించింది. యూరప్ నుంచి కూడా దీనిపై హామీ కావాలని కోరింది. అప్పటికి రష్యా పూర్తి స్థాయి యుద్ధం మొదలుపెట్టి కొన్ని నెలలు మాత్రమే అయింది. కానీ బ్రిటన్ మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ హుటాహుటీన ఉక్రెయిన్ రాజధాని కీవ్ వచ్చి రాజీకి ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకోవద్దని నచ్చజెప్పారు. నాటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సలహాతోనే జాన్సన్ ఈ సైంధవపాత్ర పోషించారు. ఇప్పుడు రష్యా అధ్యక్షుడు పుతిన్ మొండికేస్తున్నారు. ఆయనకు శాంతియుత పరిష్కారం ఆలోచనే లేదు. ఆధిపత్య స్థాపనే లక్ష్యం. భారత్ వచ్చేముందు ఈ సంగతి నిర్మొహమాటంగా చెప్పారు. 'ఉక్రెయిన్ తూర్పు ప్రాంతమైన డోన్బాస్ నుంచి ఉక్రెయిన్ దళాలు వైదొలగితే సరే... లేదా దాన్ని బలవంతంగా స్వాధీనం చేసుకుంటాం' అని ఆయన ప్రకటించారు. వైరిపక్షాలు చర్చలంటూ మొదలుపెడితే వాటి వైఖరులు ఏదోమేరకు చల్లారుతాయి. కానీ ఆ చర్చలు ఫలించాలంటే తొలుత కాల్పుల విరమణ పాటించాలి. రష్యా, ఉక్రెయిన్ రెండూ అందుకు సిద్ధపడటం లేదు. యుద్ధ వాతావరణంలో చర్చలు ప్రశాంతంగా సాగబోవన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరించి రష్యా ప్రతిపాదనలకు అంగీకరించమంటూ ఉక్రెయిన్‌పై అమెరికా ఒత్తిడి తెస్తోంది. ఈ విషయంలో అమెరికాతో నేరుగా మాట్లాడే ధైర్యంలేని యూరప్ దేశాలు... ట్రంప్‌ను ఖాతరు చేయొద్దని ఉక్రెయిన్‌కు నూరిపోస్తున్నాయి. అవకాశం వచ్చినప్పుడు కాలదన్నుకుంటే, అగ్రరాజ్యాల చదరంగంలో పావుగా మారితే ఏమవుతుందో ఉక్రెయిన్ ఈ దశలోనైనా గుర్తెరగాలి. దీన్నుంచి బయటపడాలంటే సొంత గొంతు వినిపించటం ప్రారంభించాలి.

## కేసీఆర్ వ్యాఖ్యలపై ఏపీ మంత్రి పార్థసారథి ఫైర్

**మొదటిపేజీ తరువాయి** - పారదర్శకంగా మీకు చూపిస్తామని కేసీఆర్ కు పార్థసారథి సూచించారు. ఏపీలో పెట్టుబడులు పెట్టిన వారు తెలంగాణలో కూడా పెట్టుబడులు పెట్టారని చెప్పారు. రెండు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలనేదే తమ ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని... ఈ విషయాన్ని ఆయన ఎన్నోసార్లు చెప్పారని గుర్తు చేశారు. ఐదేళ్ల వైసీపీ విధ్వంసం నుంచి అమరావతిని అభివృద్ధి చేస్తుంటే... మీరు ఇలా మాట్లాడటం తగదని అన్నారు.

## 'బాహుబలి' రాకెట్ ప్రయోగం విజయవంతం

**మొదటిపేజీ తరువాయి** - ఏపీ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. భారత భూభాగం నుంచి ఇప్పటివరకు ప్రయోగించిన అత్యంత భారీ ఉపగ్రహమిదేనని పేర్కొన్న ఆయన, ఈ మిషన్ దేశానికి మరో మైలురాయిగా నిలిచిందన్నారు.సీఎం చంద్రబాబు నాయుడు కూడా 'ఎక్స్' వేదికగా ఇస్రో బృందాన్ని అభినందించారు. అత్యంత భారీ ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టడం ద్వారా భారత వాణిజ్య అంతరిక్ష సామర్థ్యం మరింత బలోపేతమైందన్నారు. ప్రపంచ స్థాయిలో విశ్వసనీయ లాంచ్ భాగస్వామిగా భారత్‌కు మరింత గుర్తింపు లభించిందని పేర్కొన్నారు.రాష్ట్ర ఐటీ, హెచ్‌ఆర్‌డీ శాఖ మంత్రి నారా లోకేశ్ కూడా 'బాహుబలి'గా పేరుగాంచిన ఎల్వీఎం3 రాకెట్ విజయంపై శాస్త్రవేత్తలను ప్రశంసించారు. ఇది భారత వాణిజ్య ప్రయోగాల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ఘట్టమని అన్నారు.ఇక వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ కూడా ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేశారు. ఈ విజయం భారత శాస్త్రీయ ప్రతిభకు నిదర్శనమని, దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు.

## విద్యార్థులు లేని 'జీరో' పాఠశాలలపై తెలంగాణ కీలక నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి** - తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు లేని 'జీరో' ప్రభుత్వ పాఠశాలలపై పాఠశాల విద్యా శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు లేని పాఠశాలలను తాత్కాలికంగా మూసివేయనున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి వాటిని ఏకీకృత జిల్లా పాఠశాల విద్యా సమాచారం గణాంకాల్లో చూపించరు. ఒక్క విద్యార్థి కూడా లేని ప్రభుత్వ పాఠశాలల్లో సంఖ్య తెలంగాణలో అధికంగా ఉంది. 2024-25 విద్యా సంవత్సరపు లెక్కల ప్రకారం తెలంగాణలో ఇలాంటి పాఠశాలలు 2,245 ఉన్నాయి.పాఠశాల విద్యా శాఖ పరిధిలో 2 వేలకు పైగా పాఠశాలలు ఉండగా, వాటిలో 1,441 చోట్ల విద్యార్థులు లేరు. ఉపాధ్యాయ పోస్టులు కూడా లేవు. మరో 600 పాఠశాలల్లో విద్యార్థులు లేకున్నా ఉపాధ్యాయ పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతానికి 1,441 పాఠశాలలను తాత్కాలికంగా మూసివేయనున్నారు. మిగిలిన పాఠశాలలకు సంబంధించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఈ పాఠశాలలు పని చేయడం లేనందున తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.గ్రామస్థులు తమ పిల్లలను బడికి పంపిస్తామని కోరితే పాఠశాలలను తిరిగి తెరుస్తామని, ఉపాధ్యాయులను కూడా నియమిస్తామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. మారుమూల శివారు తండాల్లో కూడా తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఈ ఏడాది 200 పాఠశాలలను కొత్తగా ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తు చేస్తున్నారు.

# చర్చించి 'విశాఖ రుషికొండ'పై నిర్ణయం'

**మొదటిపేజీ తరువాయి** - వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ , టూరిజం ఎండీ ఆమ్రపాలి, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు. రుషికొండ ప్యాలెస్ ను ఆతిథ్య కేంద్రాలుగా మార్చేందుకు టాటా గ్రూప్ సహా పలు ప్రముఖ సంస్థలు ముందుకు రాగా ఎవరికి అప్పగించాలనే అంశంపై చర్చించారు.ఆతిథ్య కేంద్రాలు, రెస్టారెంట్లు, కన్వెన్షన్ సెంటర్లు, ఫంక్షన్ హాళ్లుగా వినియోగానికి సంస్థలు డీపీఆర్ ఇవ్వగా వాటిపై సమగ్ర విశ్లేషణలు జరిపారు. ప్రసుతం ఉన్న ప్యాలెస్ లు రాజభవనాలు కావడంతో పర్యాటకుల కోసం ప్రత్యేకంగా 60 వేల చదరపు అడుగుల్లో అదనంగా గదులు నిర్మిస్తే తీసుకునేందుకు సిద్ధమని పలు సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేయగా వాటి నిర్మాణాలపై ప్రత్యేకంగా చర్చించారు. రుషికొండ భవనాల కింద ఉన్న ప్రాంతంలో 9 ఎకరాల్లోని 7 ఎకరాల్లో భవనాల నిర్మాణాలు సాధ్యపడదని అధికారులు తాజాగా తేల్చారు. 7 ఎకరాలు సీఆర్ జెడ్ పరిధిలోకి వస్తాయని, నిర్మాణాలు చేసేందుకు నిబంధనలు ఒప్పుకోవని తేల్చారు.మిగిలిన 2 ఎకరాలు సరిపోని కారణంగా రుషికొండ సమీపంలోనే అదనంగా భూముల లభ్యతపై దృష్టి



సారించాలని అధికారులను మంత్రి వర్గ ఉపసంఘం ఆదేశించింది. రెండు రోజుల్లో మరో సారి సమావేశమై భూముల లభ్యత సహా ప్యాలెస్ లపై అదనపు భవంతుల నిర్మాణాల అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు. ఎవరికి భవనాలు అప్పగించాలనే అంశంపైనా సుదీర్ఘంగా చర్చించనున్నారు. అనంతరం ప్రభుత్వ పరంగా తీసుకువాల్సిన చర్యలపై నివేదిక రూపొందించి వచ్చే కేబినెట్ కు నివేదిక ఇవ్వాలని నిర్ణయించారు. గత ప్రభుత్వం విధానాలతో ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లగా, వాటిని వినియోగంలోకి తీసుకురావడం తలనొప్పిగా మారిందని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. ప్రజలకు ఉపయోగపడటం అదే సమయంలో ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని మంత్రి దుర్గేశ్ తెలిపారు.'ఆతిథ్యరంగంలోని పెద్ద సంస్థలు ఈ నిర్మాణాల వినియోగానికి ముందుకు వచ్చాయి. ఆతిథ్యరంగం నిర్వహణ కోసం పెద్ద సంస్థలు అదనపు స్థలం కోరాయి. రుషికొండ దిగువనే 9 ఎకరాలు గుర్తించాం కానీ అందులో 7 ఎకరాలు సీఆర్ జెడ్ నిబంధనల కిందకు వస్తుంది. నిర్మాణాలు చేయడానికి లేదు. ఈ తరుణంలో తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై త్వరలోనే మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటాం.విశాఖలోని రుషికొండ భవనాలను పర్యాటక ప్రాంతంగా, అద్భుత ఆతిథ్య కేంద్రాలుగా, పర్యాటక ప్రాంతంగా, విలాసవంతమైన బీచ్ విల్లాలుగా చక్కని మ్యూజియంతో అలరారేలా తిరిగి తీర్చిదిద్దేందుకు ప్రముఖ హోటల్, హాస్పిటాలిటీ సంస్థలు ప్రభుత్వానికి గతంలోనే ప్రతిపాదనలు సమర్పించిన సంగతి తలిసిందే.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**మొదటిపేజీ తరువాయి** - జనసేన కార్యకర్తల ఇళ్లు కూల్చివేశారు. జనసేన ఆవిర్భావ సభకు భూములు ఇచ్చారనే కక్షతో ఇలా చేశారనే ఆరోపణలున్నాయి. అప్పట్లో పవన్ కల్యాణ్ ఈ గ్రామంలో పర్యటించి బాధితులకు ధైర్యం చెప్పారు. ఎన్నికల్లో గెలిచాక మళ్లీ రావాలని ఇండ్ల నాగేశ్వరమ్మ అనే వృద్ధురాలు ఆయన్ను కోరింది.ఈ నేపథ్యంలో ఆమెకు ఇచ్చిన మాట మేరకు ఇప్పటం చేరుకున్న పవన్ నాగేశ్వరమ్మ ఇంటికి వెళ్లారు. ఆయనకు వృద్ధురాలు ఆప్యాయంగా స్వాగతం పలికారు. ఆమెను పవన్ ఆత్మీయ ఆలింగనం చేసుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. వృద్ధురాలికి రూ.50 వేలు, ఆమె మనవడి చదువుకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. నాగేశ్వరమ్మ కుటుంబసభ్యులతో ఆయన మాట్లాడారు. ఆమె మనవడి చదువు కోసం ప్రతి నెలా తన వేతనం నుంచి రూ.5 వేలు ఇవ్వాలని పవన్ నిర్ణయించారు. అలాగే మనవడికి ఉద్యోగం కావాలని అడగగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం నాగేశ్వరమ్మ మాట్లాడుతూ, ఇచ్చిన మాట ప్రకారం పవన్ తమ ఇంటికి రావడం సంతోషంగా ఉందన్నారు. ఇంటికి పెద్ద కుమారుడిలా యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారని ఆమె చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారని తెలిపారు.2022 మార్చి 14న జనసేన ఆవిర్భావ సభ కోసం ఇప్పటం గ్రామస్థులు తమ భూములు ఇచ్చారు. దీంతో వైఎస్సార్సీపీ ప్రభుత్వం, అప్పటి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వారిపై కక్షగట్టారు. చిన్న గ్రామంలో 100 అడుగుల మేర రోడ్డు విస్తరించాలంటూ జనసేన సానుభూతిపరుల ఇళ్లు, ప్రహరీలు కూల్చివేశారు. 2022 నవంబర్ 4న జరిగిన ఈ ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనమైంది.కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే తమ ఇళ్లను కూల్చివేశారని ఇప్పటం గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన సభకు స్థలం ఇచ్చినందుకే మా ఇళ్లను కూల్చివేస్తారా? అంటూ అప్పటి వైఎస్సార్సీపీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటం లాంటి చిన్న గ్రామంలో రోడ్డు వెడల్పు చేయాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు.అనంతరం ఈ విషయం తెలుసుకున్న పవన్ కల్యాణ్ 2022 నవంబర్ 5వ తేదీన ఇప్పటం గ్రామాన్ని సందర్శించి బాధితులకు ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలకు రూ.50,000 చొప్పున ఆర్థిక సాయం అందించారు.



పవన్ ఇప్పటం వెళ్లిన సమయంలో బండ్ల నాగేశ్వరమ్మ అనే వృద్ధురాలు ఆయన చేతులు పట్టుకుని కన్నీరు పెట్టుకుంది. చలించిపోయిన పవన్: "నీవు కూడా నా కుమారుడి లాంటి వాడివేనని" జరిగిన దుర్మార్గంపై న్యాయం చేయాలని ఆమె (బండ్ల నాగేశ్వరమ్మ) కోరింది. చలించిపోయిన పవన్ ఎన్నికల్లో గెలిచాక మళ్లీ ఇప్పటం గ్రామానికి వస్తానని మాట ఇచ్చారు. ఈ మేరకు ఇప్పటం గ్రామానికి పవన్ కల్యాణ్ వెళ్లారు. అప్పుడు పార్టీ అధ్యక్షుడి హోదాలో ఇప్పటంకు వెళ్లిన పవన్ కల్యాణ్, ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి హోదాలో ఈ గ్రామానికి వెళ్లటం విశేషం.

# కొత్త సర్పంచ్‌లకు తీపి కబురు గ్రామాలకు ప్రత్యేకంగా రూ.10లక్షలు

**మొదటిపేజీ తరువాయి** - సర్పంచిలకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. గ్రామాల్లో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అభివృద్ధి నిధులు ఉపయోగించాలన్నారు.కొడంగల్ నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతి గ్రామం, తండాకు రోడ్లు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గుడి, బడి, తాగునీరు, పేదలకు ఇళ్లు, రేషన్ కార్డులు అందిస్తామని వెల్లడించారు. నిరుద్యోగుల కోసం ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేస్తామన్న సీఎం నూతనంగా ఎన్నికైన సర్పంచిలు గ్రామాల్లో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా ప్రజా సేవ చేయాలని పిలుపునిచ్చారు.దేశ పునాదులు గ్రామాల్లో ఉన్నాయని గాంధీజీ చెప్పారన్న ఆయన, గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పేదలకు పథకాలు చేరినప్పుడే నిజమైన పాలన అందుబాటులోకి వస్తుందని వివరించారు. కొడంగల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా నిలబెట్టిన నాయకులను అభినందించారు. ఇక్కడి సమస్యల పరిష్కారానికి తన సోదరుడు తిరుపతిరెడ్డిని అందుబాటులో ఉంచానన్నారు.'ఎన్నికలు ముగిశాయి, ఇక ఎలాంటి రాజకీయాలు లేవు. ఎన్నికల్లో పోటీ చేసినప్పుడే పార్టీలు, పంథాలు ఉండాలి. తెలంగాణ రాష్ట్రానికి నాయకత్వ వహిస్తున్న మనం అందరినీ కలుపుకొని పోదాం. నియోజకవర్గంలోని గ్రామాలు, తండాల్లో ఎలాంటి సమస్యలు ఉండకూడదు"అని సీఎం అన్నారు.



# బీఆర్ఎస్ గతం కాంగ్రెస్ భవిష్యత్తు

**మొదటిపేజీ తరువాయి** - అయితే 100కు పైగా స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. "రాసిపెట్టుకోండి. రెండోసారి కాంగ్రెస్ పాలనను తీసుకువస్తాం. ఇదే నా సవాల్" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. పదేళ్లలో కేసీఆర్ ఏ ప్రాజెక్టును పూర్తి చేయలేదని ముఖ్యమంత్రి విమర్శించారు.కేసీఆర్ తనను జైలుకు పంపించాడని, తన కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టాడని రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ తనపై విమర్శలు చేస్తూ తోలు తీస్తానని హెచ్చరించారని, కానీ మా సర్పంచ్‌లు చింతమడకలో మిమ్మల్ని చీరి చింతాకు కడతారని హెచ్చరించారు. కేంద్రమంత్రిగా, ముఖ్యమంత్రిగా, రాష్ట్ర మంత్రిగా, తెలంగాణ సాధించిన అని చెప్పుకునే వ్యక్తిగా ఇలాంటి మాటలు మాట్లాడవచ్చా అని నిలదీశారు.మేం మాట్లాడాలనుకుంటే చాలా మాట్లాడుతామని, కానీ మర్యాద ఉండదని ఊరుకుంటున్నామని అన్నారు. మేం మాట్లాడటం మొదలు పెడితే మల్లన్న సాగర్‌లో దూకి చస్తావని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఇదేనా అని ధ్వజమెత్తారు. పాలమూరు ప్రాజెక్టును ఎండగట్టారని, ప్రాజెక్టులు ఏవీ పూర్తి చేయలేదని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లు పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు.పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు. కేసీఆర్ వలస వచ్చి పాలమూరు ఎంపీ అయ్యారని అన్నారు. పగ సాధించడం మొదలు పెడితే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని వదిలి పెట్టానని అన్నారు. నేను ప్రమాణం చేసినప్పుడే ఆయన కూలబడ్డారని, ఇంతకంటే పెద్ద శిక్ష ఏముంటుందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఫాంహౌస్‌ను బందీఖానాగా మార్చుకున్నారని, చర్లపల్లి, చంచల్‌గూడ జైలుకు పంపినా అదే పరిస్థితి ఉంటుందని అన్నారు.తాను నల్లమల నుంచి వచ్చి జెడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ తర్వాత ముఖ్యమంత్రిని అయ్యానని రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఏ అంశంపై అయినా చర్చించడానికి సిద్ధమని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా కేసీఆర్ వయస్సును గౌరవిస్తామని, ఈ నెల 29 నుంచి జరగబోయే సమావేశాలకు కేసీఆర్ వచ్చి సూచనలు చేయాలని అన్నారు. ఖాళీగా ఉన్నప్పుడు పార్టీ కార్యాలయానికి వచ్చి ప్రెస్‌మీట్‌లు పెట్టడం కాదని అన్నారు.

# ప్రధాని అభ్యర్థిగా ప్రియాంక గాంధీ!

**మొదటిపేజీ తరువాయి** -

కాంగ్రెస్ వర్గాలుగా చీలిపోయారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల ప్రకటనలు రాహుల్ గాంధీపై విశ్వాసం లేనట్లుగా స్పష్టంగా తెలుస్తోందని అన్నారు.కొన్నిసార్లు శశిథరూర్, రాహుల్ గాంధీ ప్రకటనలతో విభేదిస్తారని, ఇమ్రాన్ మసూద్ ప్రియాంక గాంధీని ప్రధానమంత్రిగా ప్రతిపాదిస్తారని, ఆ తర్వాత వివరణ ఇస్తుంటారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నుంచి బహిష్కరించబడిన మహమ్మద్ మోక్విమ్ కూడా రాహుల్ గాంధీ నాయకత్వ సామర్థ్యాన్ని ప్రశ్నించారని గుర్తు చేశారు. ప్రియాంక గాంధీకి పార్టీలో మరింత కీలక పాత్ర ఇవ్వాలని ఆయన సూచించారని గుర్తు చేశారు.ప్రియాంక గాంధీ ప్రధానమంత్రి కావాలనే వ్యాఖ్యలకు రాబర్ట్ వాద్రా కూడా మద్దతు పలికారని, ఇది కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత సంక్షోభాన్ని వెల్లడిస్తోందని పూనవాలా అన్నారు. రాహుల్ గాంధీ సామర్థ్యంపై రాబర్ట్ వాద్రాకు నమ్మకం లేనట్లుగా ఉందని అన్నారు. రాహుల్ గాంధీకి ప్రజల్లోనే కాదు, సొంత పార్టీలో కూడా నమ్మకం లేకుండా పోయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక కుటుంబ పార్టీ అని ఆయన విమర్శించారు.బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షానవాజ్ హుస్సేన్ కూడా ఈ అంశంపై స్పందించారు. లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబంలో తేజ్ ప్రతాప్ యాదవ్, తేజస్వి యాదవ్ మధ్య విభేదాలు ఉన్నట్లే, కాంగ్రెస్‌లో రాహుల్, ప్రియాంక మధ్య విభేదాలు తలెత్తాయని అన్నారు. ప్రధానమంత్రి కావాలనే కలలు కనే హక్కు అందరికీ ఉంటుందని ఆయన అన్నారు. బీజేపీలో ఎవరైనా ప్రధానమంత్రి కావొచ్చని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రియాంక గాంధీ ప్రధాని కావాలని కలలు కనే హక్కు రాబర్ట్ వాద్రాకు ఉందని, కానీ రాబోయే 50 ఏళ్లు బీజేపీయే అధికారంలో ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.కాగా, కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రియాంక గాంధీని ఎంపిక చేయాలని ఆ పార్టీ ఎంపీ ఇమ్రాన్ మసూద్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై రాబర్ట్ వాద్రా కూడా స్పందించారు. ప్రియాంక ప్రధాని కావాలని చాలాచోట్ల నుంచి డిమాండ్లు వస్తున్నాయని, తాను కూడా రాజకీయాల్లోకి రావాలని అందరూ కోరుకుంటున్నారని ఆయన అన్నారు. ప్రస్తుతం ప్రియాంక దృష్టి ప్రజా సమస్యలపైనే ఉందని ఆయన అన్నారు.

# మూడు కొత్త ఎయిర్‌లైన్స్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**మొదటిపేజీ తరువాయి** -

దేశీయ విమానయాన రంగంలో సంచలనం సృష్టించిన ఇండిగో సంక్షోభం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలకు ఉపక్రమించింది. విమానయాన మార్కెట్లో పోటీని పెంచి, రెండు ప్రధాన సంస్థల ఆధిపత్యానికి అడ్డుకట్ట వేసే దిశగా మరో మూడు కొత్త ఎయిర్‌లైన్స్ ప్రవేశానికి మార్గం సుగమం చేసింది. శంఖ్ ఎయిర్, అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్‌ప్రెస్ అనే మూడు సంస్థలకు నిరభ్యంతర పత్రాలు (ఎన్‌ఓసీ) జారీ చేసినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రకటించారు.ఈ నెల ఆరంభంలో కొత్త ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ నిబంధనల కారణంగా ఇండిగో ఎయిర్‌లైన్స్ తీవ్రమైన సిబ్బంది కొరతను ఎదుర్కొంది. ఫలితంగా, కేవలం వారం రోజుల్లోనే 5,000కు పైగా విమాన సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చింది. ఈ పరిణామం దేశవ్యాప్తంగా ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా, దేశీయ విమానయాన రంగంలో కేవలం ఒకటి, రెండు సంస్థలపై ఆధారపడటంలోని ప్రమాదాలను బహిర్గతం చేసింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం కొత్త సంస్థలను ప్రోత్సహించేందుకు వేగంగా అడుగులు వేసింది. ఈ విషయాన్ని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా ద్వారా వెల్లడించారు. "గత వారం రోజులుగా భారత గగనతలంలోకి అడుగుపెట్టాలని ఆశిస్తున్న శంఖ్ ఎయిర్, అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్‌ప్రెస్ బృందాలతో సమావేశమవడం సంతోషంగా ఉంది. శంఖ్ ఎయిర్‌కు ఇప్పటికే ఎన్‌ఓసీ లభించగా, అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్‌ప్రెస్‌లకు ఈ వారం ఎన్‌ఓసీలు మంజూరు చేశాం," అని ఆయన తెలిపారు.ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత విమానయాన మార్కెట్లో మరిన్ని సంస్థలను ప్రోత్సహించడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. "ప్రధానమంత్రి మోదీ విధానాల మేరకు, ఉడాన్ వంటి పథకాల ద్వారా ఇప్పటికే స్టార్ ఎయిర్, ఇండియా వన్ ఎయిర్, ఫ్లై91 వంటి చిన్న సంస్థలు ప్రాంతీయ కనెక్టివిటీలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ రంగంలో వృద్ధికి ఇంకా ఎంతో అవకాశం ఉంది," అని రామ్మోహన్ నాయుడు వివరించారు.శంఖ్ ఎయిర్: ఉత్తరప్రదేశ్ కేంద్రంగా కార్యకలాపాలు ప్రారంభించనుంది. లక్నో హబ్‌గా వారణాసి, గోరఖ్‌పూర్, అయోధ్య, ఇండోర్ వంటి నగరాలకు బోయింగ్ 737-800 విమానాలతో సేవలు అందించాలని యోచిస్తోంది. 2026 ప్రథమార్థంలో కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉంది.అల్ హింద్ ఎయిర్: కేరళకు చెందిన ప్రముఖ అల్హింద్ గ్రూప్ దీనిని ప్రారంభిస్తోంది. కొచ్చి కేంద్రంగా ఏటీఆర్ 72-600 విమానాలతో కేరళలోని నగరాల నుంచి బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాలకు సేవలు అందిస్తుంది.ప్రస్తుతం దేశీయ మార్కెట్లో ఇండిగో, ఎయిర్ ఇండియా గ్రూప్‌లకు కలిపి 90% పైగా వాటా ఉంది. ఒక్క ఇండిగోకే 65% వాటా ఉంది. కొత్త సంస్థల రాకతో ఈ గుత్తాధిపత్యం తగ్గి, ప్రయాణికులకు మరిన్ని ఎంపికలు అందుబాటులోకి వస్తాయని, టికెట్ ధరలు కూడా అదుపులోకి వస్తాయని నిపుణులు ఆశిస్తున్నారు. ఎన్‌ఓసీ పొందిన ఈ సంస్థలు, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ నుంచి తదుపరి అనుమతులు పొంది, త్వరలోనే తమ సేవలను ప్రారంభించనున్నాయి.

# ట్రిపుల్ ఆర్, భూసేకరణ, రైతు - చేనేత సమస్యలపై జాగృతి పోరాటం

## భువనగిరిలో కవిత సంచలన వ్యాఖ్యలు



**భువనగిరి డిసెంబర్ 24 (ప్రజా మంటలు) :** జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా భువనగిరి జిల్లాలో పర్యటించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రెస్‌మీట్‌లో విస్తృత అంశాలపై స్పందించారు. తాను తెలంగాణ ప్రజల బాణమని, ఎవరో ఆపరేట్ చేసే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. 2029 ఎన్నికల్లో బరిలో ఉంటామని తెలిపారు. బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్‌కు కారణం చెప్పలేదని, పార్టీ లోపాలపై అప్పట్లో భాగస్వామినైనందుకు ప్రజలకు క్షమాపణలు చెప్పారు. ట్రిపుల్ ఆర్ ప్రాజెక్ట్‌లో పెద్దల భూముల కోసం పేదల భూములను బలి పెడుతున్నారని, నాయకుల అవినీతికి అనుగుణంగా ఆలైన్‌మెంట్లు మారుస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఆన్‌లైన్ ఉద్యమం చేపట్టి జనవరి 5న హైదరాబాద్‌లో బాధిత రైతులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు. బస్వాపూర్ రిజర్వాయర్ ద్వారా ఇప్పటివరకు చుక్క నీరు కూడా రాలేదని విమర్శించారు. భువనగిరి జిల్లా అభివృద్ధి, ఎయిమ్స్ నిర్మాణం ఆలస్యం, స్థానికులకు ఉద్యోగాల్లో 80 శాతం కేటాయింపు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఆలేరు 100 పడకల హాస్పిటల్, రోడ్డు ప్రమాదాలు, బ్రిడ్జి నిర్మాణం, భూసేకరణ అన్యాయాలు, డ్రై పోర్ట్, పరిశ్రమల వల్ల కాలుష్యం వంటి అంశాలను ప్రస్తావించారు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో సాగునీటి లక్ష్యాలు నెరవేరలేదని, కాల్వల నిర్వహణ దారుణంగా ఉందని పేర్కొన్నారు. అదే రోజు భువనగిరి ఫోర్ట్ వద్ద రాక్ క్లైంబింగ్ శిక్షణ పొందుతున్న విద్యార్థులను కలిసిన కవిత, స్వర్ణకార వీధిలో స్వర్ణకారులతో, కుమ్మరి వీధిలో కుమ్మరి కార్మికులతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. స్వర్ణకారుల వృత్తిని గౌరవిస్తూ, అవకాశం వస్తే పుస్తె మెట్టెల కొనుగోలు ఫైల్‌పై మొదటి సంతకం స్వర్ణకారుల నుంచే చేస్తానని వ్యాఖ్యానించారు. జియాపల్లి క్రషర్ పేలుళ్లతో ఇబ్బంది పడుతున్న ప్రజలను పరామర్శించిన ఆమె, భూదాన్ పోచంపల్లిలో చేనేత కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. చేనేతలకు రుణమాఫీ, నిధుల విడుదల వెంటనే చేయాలని డిమాండ్ చేస్తూ, ప్రజా సమస్యలపై జాగృతి పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# ప్రజాపాలనలో రిటైర్డ్ ఉద్యోగుల దుస్థితి దుర్భరం

## రిటైర్డ్ బెనిఫిట్స్ ని ఏక కాలంలో చెల్లించాలి.

## జిల్లా పరిషత్ తొలి చైర్ పర్సన్ దావ వసంత సురేష్





**జగిత్యాల డిసెంబర్ 24 (ప్రజా మంటలు) :** ప్రజాపాలన అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి అత్యంత దుర్భరంగా మారిందని జిల్లా పరిషత్ తొలి చైర్ పర్సన్ శ్రీమతి దావ వసంత సురేష్ విమర్శించారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో 2024 ఏప్రిల్ నుండి రిటైర్డ్ అయినా ఉద్యోగుల బెనిఫిట్స్ బకాయిలను విడుదల చెయ్యాలని కోరుతూ స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టగా, ఈ దీక్ష కు వసంత సంఘీభావం తెలిపారు. అనంతరం వసంత మాట్లాడుతూ గత ఏడాది మార్చి తర్వాత రిటైర్డ్ అయిన ఉద్యోగుల పరిస్థితి దుఃఖపూరితంగా మారిందన్నారు. గత 20 నెలలుగా రాష్ట్రంలో 14 వేల మంది ఉద్యోగులు పదవి విరమణ చేసిన వాళ్లకు రావాల్సిన గ్రాట్యూటీ, కమ్యూటెడ్ పెన్షన్, ప్రావిడెంట్ ఫండ్, లీవ్ ఎన్కాష్ మెంట్ లాంటి ప్రయోజనాలు అందక రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వసంత ఆవేదన వ్యక్తం చేశారు. జీవితాంతం కష్టపడి రిటైర్డ్ బెనిఫిట్స్ మీద ఆశలు పెట్టుకున్న ఉద్యోగులకు ప్రభుత్వ వైఖరి శాపంగా మారిందని విమర్శించారు. ఆర్థిక వెసులుబాటు లేక మానసికంగా కుంగిపోయి, రోగాలపాలై, సరైన వైద్య సేవలు అందక గడిచిన 20 నెలల్లో సుమారు 35 మంది మరణించారని, ఈ రిటైర్డ్ ఉద్యోగుల మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. అధికారంలోకి వచ్చేందుకు అడ్డు అదుపు లేని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రం లో అధికారంలోకి రాగానే ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ప్రయోజనాలు అందించక కాలయాపన చెయ్యడం ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి అసమర్థతకు నిదర్శనం అన్నారు. ఆరు నెలల్లో అమలు చేస్తామన్నా పీఆర్సి రెండేళ్లు గడిచిన ఊసేత్తక పోవడం వెనుక అంతర్యం ఏంటని వసంత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బెనిఫిట్స్ అందక ఉద్యోగులు మనోవేదన తో ఓ వైపు మరణిస్తుంటే, వంద కోట్లతో మెస్సి మ్యాచ్, మిస్ వరల్డ్ పేరుతో ప్రజాధనం వృధా చేస్తూ పాలన చేతగాని సీఎం ప్రజలు, ఉద్యోగుల జీవితాలతో సీఎం రేవంత్ రెడ్డి చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు.. రిటైర్డ్ ఎంప్లాయిస్ సమస్యలను బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ కి మరియు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాడుతామని బి ఆర్ ఎస్ పార్టీ పక్షాన అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆయిల్ లేని నరేందర్ రావు ట్రెజరర్ లక్ష్మీనారాయణ జనరల్ సెక్రెటరీ ఎన్నం రాంరెడ్డి కో శాఖ అధికారి లక్ష్మి నారాయణ బిఆర్ ఎస్ నాయకులు శీలం ప్రవీణ్ బుర్ర ప్రవీణ్ గౌడ్ అనురాధ బాలే చందు వెంకట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ తదితరులు ఉన్నారు.

# విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరసన ధర్నా బంగ్లాదేశ్ ప్రధానమంత్రి దిష్టిబొమ్మ దగ్ధం





**జగిత్యాల డిసెంబర్ 24 (ప్రజా మంటలు) :** జిల్లా విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో బంగ్లాదేశ్లో హిందువులపై దాడులు చేసి మారణ హోమం సృష్టిస్తున్నారని దాని నిరసిస్తూ బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు. స్థానిక తహశీల్ చౌరస్తాలో నిరసన ధర్నా చేపట్టి బంగ్లాదేశ్ ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు బోయినిపెల్లి పద్మాకర్, నగర అధ్యక్షులు జిట్టవేణి అరుణ్ కుమార్, బిజెపి సీనియర్ నాయకులు సిపెల్లి రవి, లింగంపేట్ శ్రీనివాస్ మాట్లాడుతూ బంగ్లాదేశ్ లో మన హిందువుల పైన జరుగుతున్నటువంటి మారణకాండను నిరసిస్తూ భారతదేశానికి స్వాతంత్రం వచ్చినప్పుడు బంగ్లాదేశ్ పాకిస్తాన్ రెండు దేశాలు విడిపోయి మన హిందువులు భారతదేశానికి వచ్చే వారిని అప్పుడున్న ప్రభుత్వం వారిని అడ్డుకోవడం జరిగిందన్నారు. ఆనాడు జరిగినటువంటి ఊచకోత ఇప్పటికీ హిందువుల పైన మారన హోమం జరుగుతూనే ఉందని ఎలాగైనా బంగ్లాదేశ్ లో ఉన్నటువంటి హిందువులను భారత ప్రభుత్వం చొరవ తీసుకొని వారిని కాపాడాలని అన్నారు. దీప్తి చందు అనే ఒక హిందూ కేవలం దేవుడు అందరికీ సమానమే అని అన్నందుకు అతన్ని సజీవంగా నగ్నంగా మతోన్మాధులు అందరూ కలిసి కొట్టి చంపి రోడ్డుపై విచక్షణ రహితంగా క్రూరంగా రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లి చెట్టుకు ఉరి తీసి కాల్ చేసారని దీని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇప్పటికైనా భారతదేశం లో హిందువులందరూ ఒక్కటయ్యే సమయం వచ్చిందని ఇప్పటికైనా అందరూ ఒక్కటి కావాలని కోరారు. ప్రతి హిందువులను కాపాడాలని భారత దేశంలో రోహింగాలు, బంగ్లాదేశ్ వారిని మొత్తం ఎరివేయాలని వారందరిని వారి దేశాలకు పంపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికైనా భారత ప్రధాని నరేంద్ర మోడీ చొరవ తీసుకొని అక్కడ ఉన్నటువంటి హిందువులను కాపాడాలని లేదా భారతదేశానికి హిందువులందరినీ తీసుకురావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లాసహా కార్యదర్శి గాజోజు సంతోష్ కుమార్, మామిడాల రాములు, అనుపురం శ్రీధర్, వడ్ల కట్ట భూమేష్, ఎదురుగట్ల పరంధామ్, రాజేంద్రప్రసాద్ బిజెపి సీనియర్ నాయకులు ఏసీఎస్ రాజు, అంకరి సుధాకర్, మాడిశెట్టి మల్లేశం , చీటీ శేఖర్ చిట్ల గంగాధర్ , బడే శంకర్ బ్రాహ్మణపల్లి రాజేందర్, బాలేటి శ్రీనివాస్ ప్రమోద్,,నరేంద్ర శ్రీనివాస్, బిట్టు, నాగరాజ్, పులి శ్రీధర్, అశోక్ రావు ,మహిపాల్, భారత్ సురక్షా సమితి సభ్యులు హిందూ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక దశలో గుర్తిస్తే వినికిడి సమస్యలకు చికిత్స సాధ్యం

## గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ ఎన్.వాణి

## చిన్నారులకు హియరింగ్ పరికరాల అందజేత



**సికింద్రాబాద్, డిసెంబర్ 24 ( ప్రజామంటలు) :** వినికిడి సమస్యలను చిన్నారుల్లో ప్రాథమిక దశలోనే గుర్తిస్తే సమర్థవంతమైన చికిత్స అందించవచ్చని గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌డాక్టర్‌ఎన్.వాణి తెలిపారు. గాంధీ ఆసుపత్రి ఈఎన్‌టీ విభాగం సెమినార్‌హాల్‌లో బుధవారం మీనాక్షి వెంకట్రామన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినికిడి లోపం ఉన్న చిన్నారుల తల్లుల కోసం నిర్వహించిన ఒకరోజు శిక్షణ శిబిరంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈఎన్‌టీ విభాగంలో ఇప్పటివరకు 26 మంది చిన్నారులకు కాక్లియర్ ఇంప్లాంట్‌శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించామని, మరో 26 మంది ప్రీ - ఇంప్లాంట్ థెరపీలో ఉన్నారని తెలిపారు. చిన్నారులు, తల్లులకు ఫౌండేషన్ అందిస్తున్న సేవలను ఆమె అభినందించారు. ఈఎన్‌టీ విభాగం ప్రొఫెసర్, హెచ్‌వోడీ డాక్టర్‌భూపేందర్‌సింగ్‌రాథోడ్‌మాట్లాడుతూ కాక్లియర్ ఇంప్లాంట్‌కు ముందు, తర్వాత కూడా థెరపీ అత్యంత కీలకమని అన్నారు. ఫౌండేషన్‌ద్వారా నెలకు 25 రోజులపాటు ఇచ్చే స్పీచ్‌థెరపీతో అద్భుత ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఐదుగురు చిన్నారులకు డిజిటల్‌వినికిడి యంత్రాలను ఉచితంగా అందజేశారు. అనంతరం పలువురు తల్లులు తమ అనుభవాలను పంచుకుంటూ, చికిత్సల అనంతరం పిల్లలు వినడం, వారు మాట్లాడడం తమకు అపార ఆనందం కలిగించిందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎంవోలు, గాంధీ ఆసుపత్రి ఈఎన్‌టీ విభాగం అసిస్టెంట్‌ప్రొఫెసర్లు, మీనాక్షి వెంకట్రామన్‌ఫౌండేషన్ ఫౌండర్ ట్రస్టీ సేతురామన్, డైరెక్టర్ మురళి నటరాజన్, ఆడియోలాజిస్టు పాల్గొన్నారు.

# ప్రజలతో కలిసి ముందుకు సాగుతాం

## ముత్తారం సర్పంచ్ భారతి జైపాల్ రెడ్డి



**భీమదేవరపల్లి, డిసెంబర్ 24 (ప్రజామంటలు) :** మండలంలోని ముత్తారం గ్రామంలో సోమవారం నూతనంగా గ్రామ సర్పంచ్ గా బాధ్యతలు స్వీకరించిన ఊరడి భారతి జైపాల్ రెడ్డిని ఇండియన్ నేవీ ఉద్యోగి గూడూరు ప్రశాంత్ రెడ్డి, మనోరంజితతో పాటు ముల్కనూర్ మహిళా డెయిరీ ఉద్యోగి కాశిరెడ్డి నీరజా ఆదిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, గ్రామాభివృద్ధి కోసం తమ వంతు సహకారాన్ని ఎల్లప్పుడూ అందిస్తామని వారు తెలిపారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాల మెరుగుదల, పరిశుభ్రత, విద్య, మహిళా సాధికారత వంటి అంశాల్లో గ్రామానికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. సర్పంచ్ ఊరడి భారతి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల అనంతరం రాజకీయాలకు తావులేకుండా గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ప్రజలందరితో కలిసి ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని తెలిపారు.

## ఇటిక్యాల గ్రామ అభివృద్ధికి కలిసికట్టుగా పని చేయాలి - జీవన్‌రెడ్డి



**జగిత్యాల రూరల్, డిసెంబర్ 24 (ప్రజా మంటలు) :** ఇందిరా భవన్‌లో ఇటిక్యాల గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు మాజీ మంత్రి జీవన్‌రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల అనంతరం రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయడం ఇటిక్యాల ప్రత్యేకతన్నారు. జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్, సబ్‌స్టేషన్, సింగిల్ విండో, రోడ్లు వంటి అభివృద్ధి పనులు గ్రామ సహకారంతోనే సాధ్యమయ్యాయని చెప్పారు. రైతులు, దళితులు, గీత కార్మికులకు భూములు, సాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమన్నారు. ధరణి సమస్యలు భూభారతి ద్వారా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీలకు 73వ రాజ్యాంగ సవరణ ద్వారా నిధులు వస్తాయని, ఎన్‌ఆర్‌ఈజీఎస్ గ్రామీణ ప్రాంతాలకు వరమని పేర్కొన్నారు. కొత్త పాలకవర్గం మౌలిక సౌకర్యాలపై దృష్టి పెట్టి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

## దమ్మన్నపేట గ్రామ అభివృద్ధి కోసం 50 వేల చెక్కును అందించిన

### న్యాయవాది పాదం తిరుపతి



**గొల్లపల్లి డిసెంబర్ 24 ప్రజా మంటలు :** గొల్లపల్లి మండలంలోని దమ్మన్నపేట గ్రామ అభివృద్ధి కోసం బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది పాదం తిరుపతి 50 వేల విరాళం అందజేశారు. బుధవారం దమ్మన్నపేట సర్పంచ్ ముదాం గౌతమి జానారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కోసం చొరవ చూపుతూ పాదం తిరుపతి తల్లిదండ్రులు కీశే పాదం రాజవ్వ, రాజయ్య జ్ఞాపకార్థం 50 వేల చెక్కును నూతన పాలక వర్గానికి అందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కందుకూరి కృష్ణారెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఐలయ్య, ఉపసర్పంచ్ మామిడిపల్లి శ్రీమతి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు మందలించారని క్షణికావేశంలో యువతీ ఆత్మహత్య



**గొల్లపల్లి డిసెంబర్ 25 ప్రజా మంటలు :** ధర్మపురి మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన నూతి కట్ల నీరజ సం 20,చిన్నప్పట్నుంచి ఇంట్లో మారాం చేస్తూ ఉండేది ఈ నెల 17న,ఇంట్లో ఒక చిన్న చిన్న పనులు చేయకుంటే ఎలా అని తల్లిదండ్రులు మందలించినందుకు క్షమికావేశం లో ఇంట్లో ఉన్న పురుగుల తాగగా గమనించిన కుటుంబ సభ్యులు నీరజను కరీంనగర్ ప్రైవేట్ హాస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తండ్రి రాజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ,జి మహేష్ తెలిపారు.

# పొలాస వ్యవసాయ కళాశాలలో విద్యార్థులతో మంత్రి అడ్లూరి, ఎమ్మెల్యే డా. సంజయ్ ముఖాముఖి



**జగిత్యాల రూరల్ డిసెంబర్ 24 (ప్రజా మంటలు) :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పొలాస వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జానయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, డీన్ జాన్సీ రాణి, అసోసియేట్ డీన్ భారతి నారాయణన్ భట్, హరీష్‌కుమార్ శర్మతో పాటు సర్పంచ్ శంకరయ్య, పలువురు నాయకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల సందేహాలను మంత్రి, ఎమ్మెల్యేలు నివృత్తి చేస్తూ వ్యవసాయ రంగంలో అవకాశాలపై సూచనలు చేశారు.

# ప్రభుత్వ పెన్షన్ దారుల ఒక్కరోజు దీక్షకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్





**జగిత్యాల డిసెంబర్ 24 (ప్రజా మంటలు) :** పట్టణ తహసీల్ చౌరస్తా లో తెలంగాణ ప్రభుత్వ పెన్షన్ దారుల సంయుక్త కార్యచరణ సమితి ఆధ్వర్యంలో రిటైర్మెంట్ బకాయిలు ఏక మొత్తంగా చెల్లించాలని చేస్తూ చేపట్టిన ఒకరోజు నిరాహార దీక్ష కార్యక్రమానికి హాజరై సంఘీభావం తెలిపిన జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల ఉద్యోగులు విరమణ అనంతరం రిటైర్డ్ బకాయిలు అందేలా చొరవ చూపిస్తా.. జీతాలు,పి ఆర్ సి లు పెంచడం వల్ల కొంత ఖజానా పై భారం పడింది.రిటైర్డ్ బెనిఫిట్స్ ఇవ్వలేక గత ప్రభుత్వం పదవి విరమణ ఉద్యోగ వయస్సు పెంచడం ఒక కారణం..రిటైర్డ్ బెనిఫిట్స్ ఇవ్వడం లో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందులు కూడా ఒక కారణం అని రిటైర్డ్ ఉద్యోగులు గమనించాలని అన్నారు. రాష్ట్ర ఖాజాన ఖాళీ అని అధికారులే లెక్కలు ప్రభుత్వానికి ఇస్తారు అని ముఖ్యమంత్రి కూడా అనేక మార్లు వ్యక్తం చేశారు అన్నారు. ముఖ్య మంత్రి కి అవగాహన ఉంది. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అసెంబ్లీలో మాట్లాడితేనే సమస్య పరిష్కారం కాదని స్వయంగా వెళ్లి సమస్య పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు.

# పంచాయతీలకు నెలలో నిధులు విడుదల చేయాలి - లేదంటే హైదరాబాద్‌లో సర్పంచుల పరేడ్: బండి సంజయ్



**కరీంనగర్, డిసెంబర్ 24 (ప్రజా మంటలు) :** తెలంగాణ గ్రామ పంచాయతీలకు నిధుల విడుదల విషయంలో కేంద్రమంత్రి బండి సంజయ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. నెల రోజుల్లోగా పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని డెడ్‌లైన్ విధిస్తూ, లేకపోతే హైదరాబాద్ నడిబొడ్డున రాష్ట్రవ్యాప్త సర్పంచులు, ఉప సర్పంచులతో భారీ “పరేడ్” నిర్వహిస్తామని హెచ్చరించారు. గ్రామాలకు నిధులు వచ్చే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో గెలిచిన 108 మంది బీజేపీ మద్దతుదారులైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులను సన్మానించిన బండి సంజయ్, ఈ 108 గ్రామాలను ఆదర్శంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి గ్రామంలో వాటర్ ప్లాంట్, ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అవసరమైన వైద్య పరికరాలు అందిస్తానన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని, 9వ తరగతి విద్యార్థులకు సర్పంచుల ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేస్తామని తెలిపారు. సర్పంచ్ పదవి అధికారం కాదని, ప్రజల బాధ్యత అని పేర్కొన్న ఆయన, ప్రజలకు కష్టకాలంలో తండ్రిలా ఆదుకునే నాయకత్వం చూపాలని కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు సూచించారు.

## తాడిచెల్లి నూతన సర్పంచ్ రామిడి రాజిరెడ్డికి ఘన సత్కారం



**కరీంనగర్, డిసెంబర్ 24 (ప్రజా మంటలు) :** చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం తాడిచెల్లి గ్రామానికి నూతన సర్పంచ్‌గా ఎన్నికైన సీనియర్ కాంగ్రెస్ నేత, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి రామిడి రాజిరెడ్డిని కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. గతంలో ప్రత్యక్ష ఎన్నికలో, ఏకగ్రీవంగా గెలిచి, విరామం తర్వాత మళ్లీ ప్రజాబలంతో విజయం సాధించడం రామిడి రాజిరెడ్డి నాయకత్వ పటిమకు నిదర్శనమని వారు కొనియాడారు.

# నవ్య బాలికల జూనియర్ కళాశాలలో ఘనంగా వీడ్కోలు వేడుకలు





**జగిత్యాల డిసెంబర్ 24 (ప్రజా మంటలు) :** నవ్య బాలికల జూనియర్ కళాశాల జూనియర్ విద్యార్థులు సీనియర్ విద్యార్థులకు ఏర్పాటుచేసిన వీడ్కోలు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ ఎం.సంజయ్ కుమార్ హాజరై ఎలాంటి లాభాపేక్ష లేకుండా అమ్మాయిల కోసం ప్రత్యేక కళాశాల నెలకొల్పి అతికొద్ది కాలంలోనే రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధిస్తూ, మధ్యతరగతి తల్లిదండ్రులకు అందుబాటులో ఫీజులు తీసుకుంటూ హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చూస్తున్న కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేష్, ప్రిన్సిపాల్ గాలి పెల్లి ఈశ్వర్ కుమార్లను అభినందించారు. ఈ సందర్భంగా గత సంవత్సరం మెడిసిన్ లో ఉచిత సీటు సాధించిన సరిగల్ల శ్రీయ ను అలాగే కొండగట్టు జేఎన్టీయూలో సీటుపొందిన అరుముల్ల తేజస్విని , ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో సీట్లు పొందిన విద్యార్థినులను అభినందిస్తూ 2025- 26 విద్యా సంవత్సరానికి నవ్య కళాశాల క్యాలెండర్ను ఆవిష్కరించి విద్యార్థినిలు మంచి మార్కులతో తల్లిదండ్రులకు గురువులకు జగిత్యాల జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కాంగ్రెస్ నాయకులు అడువాల లక్ష్మణ్, సుధాకర్, నవ్య కళాశాల అధ్యాపకులు,విద్యార్థినులు పాల్గొన్నారు.

## అమృత్ 2. పథకం లోని పనులను వేగవంతం చేయాలి



**కోరుట్ల డిసెంబర్ 24 (ప్రజా మంటలు) :** మున్సిపాలిటీల్లో జనాభా పెరుగుతున్న దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు ఉండకూడదన్న ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమృత్ 2.0 పథకం క్రింద నిధులు మంజూరు చేయగా ఈ పథకం కింద వాటర్ ట్యాంక్లు, వాటర్ సంప్, పైప్ లైన్లు నిర్మిస్తున్నారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో పనులు కొనసాగుతున్న నేపథ్యంలో బుధవారం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజగౌడ్ కోరుట్ల మున్సిపల్ పరిధిలో అమృత్ 2.పథకం క్రింద నిర్మిస్తున్న పనులను మరియు లే అవుట్, బయో మైనింగ్ లో భాగంగా డంప్ యార్డులను పరిశీలించారు. ఈ పరిశీలనలో కోరుట్ల మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ ఈఈ, టౌన్ ప్లానింగ్ అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ‘అంగీకరించాలంటే మా షరతులనూ పరిగణించాలి’

**గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టుపై ఏపీ వాదనలు**

**ఛత్తీస్‌గఢ్, కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ కావాలి**

**గోదావరికి ప్రత్యామ్నాయ జలాలు వచ్చేవరకూ నీటి వాటాలో ధోకా ఉండకూడదు**

**గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టుపై గట్టిగా వాదనలు వినిపించిన ఏపీ**



“ గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టుకు మేం అంగీకరించాలంటే మా షరతులను కూడా పరిగణించాలి. ఛత్తీస్‌గఢ్, కేంద్ర ప్రభుత్వం నుంచి మాకు స్పష్టమైన హామీ కావాలి. గోదావరికి ప్రత్యామ్నాయ జలాలు వచ్చేవరకూ ఏపీకి నీటి వాటాలో ధోకా లేకుండా చూస్తామని లిఖితపూర్వక ఒప్పందం జరగాలి” అని ఆంధ్రప్రదేశ్ డిమాండ్ చేసింది. మంగళవారం దిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జాతీయ జల అభివృద్ధి సంస్థ సమావేశం జరిగింది. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, పలు రాష్ట్రాల మంత్రులు, జల్‌శక్తి శాఖ కార్యదర్శి కాంతారావు, జాతీయ జల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ బాలేశ్వర్ ఠాకుర్, కేంద్ర జల సంఘం ఛైర్మన్ అనుపమ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఎజెండాలోని మిగతా అంశాలతో పాటు గోదావరి-కావేరి అనుసంధానంపైనా చర్చించారు. ఏపీ జలవనరులశాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం చీఫ్ ఇంజినీరు సుగుణాకరరావు రాష్ట్ర వాదనను వినిపించారు. ప్రభావిత రాష్ట్రాల ప్రతినిధులు వారి అభిప్రాయాలను వెల్లడించారు. ఆఖర్లో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ మాట్లాడుతూ ‘గోదావరి-కావేరి అనుసంధానంపై ఇప్పటికే ఆరు సార్లు భాగస్వామ్య రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపాం. ఏకాభిప్రాయం రాలేదు. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశమై, ఈ అంశాన్ని కొలిక్కితెద్దామ’ని సూచించారు. ఛత్తీస్‌గఢ్ ఇప్పటిదాకా తన వాటా మేరకు నీళ్లు వాడుకోలేదని, ఆ నీటితో గోదావరి-కావేరి అనుసంధానం చేపడతామని చెబుతున్నారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్ తమ నీళ్లు తాము వాడుకునేందుకు ప్రాజెక్టులు నిర్మించుకుంటామని చెబుతోంది. గోదావరి ద్వారా కావేరికి తరలించే నీటిని హిమాలయ నదుల నుంచి మహానదికి, అక్కడి నుంచి గోదావరికి మళ్లిస్తామని చెబుతున్నారు. ఈ రెండు ప్రతిపాదనలు కనీస స్థాయిలోనూ ప్రారంభం కాలేదు. మహానది నుంచి గోదావరికి నీళ్లు ఎప్పటికి వస్తాయో తెలియదు. ఈలోపు కావేరికి అనుసంధానిస్తే ఏపీ నష్టపోతుంది. ఈ ప్రాజెక్టుకు ఏపీ అంగీకరించాలంటే మాతో కేంద్ర ప్రభుత్వం, ఛత్తీస్‌గఢ్ లిఖితపూర్వక ఒప్పందాలు చేసుకోవాలి. మహానది నుంచి గోదావరికి ఎప్పటికి నీళ్లు తీసుకువస్తారో కేంద్రం చెప్పాలి. అప్పటిదాకా ఛత్తీస్‌గఢ్ తమ వాటా నీళ్లు వాడుకోబోమని అంగీకరించాలి. ఈ ఒప్పందాలన్నీ చట్ట పరిధిలో జరగాలి. ఇప్పటికే గోదావరిపై తెలంగాణ అనేక కొత్త ప్రాజెక్టులు నిర్మించింది. ఎగువన పెద్దగా ప్రాజెక్టులు లేనందున తెలంగాణ ప్రాజెక్టులకు నీళ్లు అందుతున్నాయి. ఎగువ రాష్ట్రాలు ప్రాజెక్టులు చేపడితే, గోదావరి పరీవాహక ప్రాంతంలో జలాల లభ్యతపై అంచనాలు కొత్తగా తయారుచేయాలి. ఇప్పుడున్న అవసరాలు పోనూ, ఇంకా నదిలో ఎంత నీరుంటుందో లెక్కలు తేల్చాలి. గోదావరి-కావేరి అనుసంధానంలో నాగార్జునసాగర్, ఇతర రిజర్వాయర్లను వాడుకుంటామని చెబుతున్నారు. ఆ ప్రాజెక్టులకు ప్రత్యేకంగా ఆయకట్టు ఉన్నందున ఈ అనుసంధాన ప్రాజెక్టులో కొత్త బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు కట్టాలి. గోదావరి-కావేరి అనుసంధానం ఇచ్చంపల్లి నుంచి చేపడితే మేం అంగీకరించం. పోలవరం నుంచే అనుసంధానించాలి. పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజ్, బొల్లాపల్లి రిజర్వాయర్, బనకచర్ల, సోమశిల మీదుగా జలాలు తరలించాలన్నది మా ప్రణాళిక. ఈ ఎలైన్‌మెంట్‌ను పరిగణనలోకి తీసుకోవాలి. తుంగభద్రకు అనుబంధంగా కర్ణాటక చేపట్టిన బెంటీ వరద అనుసంధాన ప్రాజెక్టులో ఏపీకి నీటి వాటా పెంచాలి.

**ఇతర రాష్ట్రాల వాదనలు :**

తెలంగాణ: గోదావరి-కావేరి అనుసంధానాన్ని సూత్రప్రాయంగా ఆమోదిస్తున్నాం. మళ్లిస్తున్న నీటిలో 50% తెలంగాణకే ఇవ్వాలి. కొత్తగా రెండు రిజర్వాయర్లు నిర్మించాలి. ఆయకట్టును బట్టి అవి మార్చుకునేలా ఉండాలి. ప్రస్తుతం ట్రైబ్యునల్ విచారణ కొనసాగుతున్నందున ఆ లోపు అనుసంధానంపై నిర్ణయం తీసుకోవద్దు. ట్రైబ్యునల్ నిర్ణయాలు వెల్లడయ్యాక అడుగు ముందుకు వేయాలి.

**తమిళనాడు: ఈ ప్రాజెక్టు మాకు పూర్తి సమ్మతమే, త్వరగా చేపట్టాలి.**

**కర్ణాటక: ఇతర రాష్ట్రాలకు 40 టీఎంసీలు పంచుతూ, మాకు 30 టీఎంసీలే ఇస్తామంటున్నారు. మరో 10 టీఎంసీలు కూడా మాకు కావాలి.**

**కేరళ: కావేరి పరీవాహకానికి నీళ్లు తరలిస్తూ, మాకు నీటి వాటాలు లేకుంటే ఎలా మాకూ నీళ్లు ఇవ్వాలి.**

**మహారాష్ట్ర: గోదావరి పరీవాహకంలో ఉన్న మా రాష్ట్రాన్ని ఇందులో పరిగణనలోకి తీసుకోలేదు. మాకూ నీటి వాటా ఉండాలి.**

# వాహనం ఢీకొని పులి -రైలు ఢీకొని చిరుత మృతి

**ఉప ముఖ్యమంత్రి పవన్ విచారం**

**పల్నాడు జిల్లాలో గుర్తుతెలియని వాహనం ఢీ కొని ప్రాణాలు కోల్పోయిన పులి**



రాష్ట్రంలోని రెండు వేర్వరు ఘటనలో పెద్దపులి, చిరుత మృతి చెందడంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ఈ రెండు ఘటనలపై తక్షణమే విచారణ చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పర్యావరణ సమతుల్యతలో వన్య ప్రాణుల సంరక్షణ ప్రధాన అంశమని, వాటి రక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా స్వీకరించాలని పవన్ చెప్పారు. ముఖ్యంగా అటవీ మార్గాలలో ప్రయాణించే వాహనదారులు మరింత బాధ్యతగా వ్యవహరించాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచించారు. అటవీ సరిహద్దు మార్గాల్లో ప్రయాణించే వాహనదారులు నిబంధనలు కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఒకే రోజు రెండు ప్రమాదాల్లో పులి, చిరుత ప్రాణాలు కోల్పోవడం బాధించిందని అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో చెప్పారు. అడవులు, వన్యప్రాణి సంచార మార్గాలకు సమీపంగా ఉన్న జాతీయ రహదారులు, రైల్వే లైన్ల వద్ద ప్రమాదాల నివారణకు మరింత పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హైవే అథారిటీ, రైల్వే, పోలీస్ శాఖలతో పాటు జిల్లా యంత్రాంగం సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి సమయాల్లో వాహనాల వేగంపై పరిమితులు విధించి నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సూచించారు. స్పీడ్ గన్స్, ఏఐ ఆధారిత సీసీ కెమెరాలు వినియోగించి పరిమితికి మించి వేగంతో వెళ్లే వాహనాలపై జరిమానాలు విధించాలన్నారు. ఒకే రోజు వేర్వేరు ప్రమాదాల్లో పులి, చిరుతపులి మృత్యువాత పడ్డాయి. పల్నాడు జిల్లా శిరిగిరిపాడు గ్రామంలోని అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలో జాతీయ రహదారి 565పై మంగళవారం ఉదయం గుర్తుతెలియని వాహనం ఢీకొని పులి ప్రాణాలు కోల్పోయింది. సుమారు 12 ఏళ్ల వయసున్న టైగర్-80 అనే ఆడపులి శిరిగిరిపాడు బీట్‌లోని మొదటి టైగర్‌పాత్ వద్ద రోడ్డు దాటే క్రమంలో వేగంగా వెళ్తున్న ఓ వాహనం దాన్ని ఢీ కొట్టినట్లు ఆనవాళు దొరికాయి. గాయపడిన పులి మరికొంత దూరం నడిచి వెళ్లి చనిపోయినట్లు పాదముద్రల ఆధారంగా నిర్ధారించారు. అయితే ఎక్కడా రక్తపు మరకలు లేకపోవడం గమనార్హం. పొగమంచుకు తోడు మూలమలుపు ఉండటంతో వాహనదారులు ముందస్తుగా పులిని చూసి ఉండకపోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్కాపురం డీఎఫ్ఓ అబ్దుల్ మాట్లాడుతూ ఘటనపై విచారణకు కమిటీ ఏర్పాటు చేశామని, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించి నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరోవైపు కర్నూలు జిల్లా ఆదోని మండలం కుప్పగల్లు రైల్వేస్టేషన్ పరిధిలో రైలు ఢీ కొని చిరుతపులి చనిపోయింది. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఆదోని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ రేంజ్ అధికారిణి తేజశ్వి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని చిరుత కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రెండు ప్రమాదాలపై వెంటనే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. చిరుతను బంధించేందుకు ఉంచిన బోనులో చిక్కున్న యువకుడు : ఇదిలా ఉండగా విజయనగరం జిల్లా చామరాజనగర తాలూకా గంగవాడి గ్రామంలో చిరుతను బంధించేందుకు ఉంచిన బోనులో ప్రమాదవశాత్తు కిట్టి అనే రైతు మంగళవారం ఉదయం చిక్కుకుపోయాడు. మూడు గంటల అనంతరం అక్కడకు వచ్చిన అటవీశాఖ సిబ్బంది బోను నుంచి అతనికి విముక్తి కల్పించారు. గ్రామంలో మూడు ఆవులపై చిరుత దాడి చేసి చంపడంతో రుద్ర అనే వ్యక్తి పొలంలో బోను ఏర్పాటు చేశారు. బోనులోకి చిరుత వస్తే ఎలా ఇరుక్కుంటుందో కుతూహలం కొద్దీ కిట్టి దాని లోపలకు వెళ్లాడు. వెంటనే బోను తలుపులు మూసుకుపోవడంతో అందులో చిక్కుకుపోయాడు.

# గుడ్‌న్యూస్ - 4 వరుసలుగా బీజాపూర్

**హైదరాబాద్ రహదారి విస్తరణ పనులు ప్రారంభం**

**విస్తరణ లేక ప్రమాదాలకు అడ్డాగా మారిన హైవే**

**ఏడాదికి దాదాపు 365మంది మరణాలు**

**ఇప్పటికే రూ.156.80 కోట్లు ఖర్చు చేసి 266.55 హెక్టార్ల భూమి సేకరణ**



బీజాపూర్ -హైదరాబాద్ జాతీయరహదారి పేరు వింటే చాలు ప్రయాణికుల గుండెల్లో రైళ్లు పరిగెడతాయి. ఈ ఆ రోడ్డుపై ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని అంతా తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేస్తుంటారు. ఇరుకుగా ఉండటం, విస్తరణకు నోచుకోకపోవడంతో ఈ హైవేపై ఎన్నో ప్రమాదాలు జరిగాయి. అలాగే ఎంతో మంది తమ ప్రాణాలను పోగొట్టుకున్నారు. అలాంటిది ఇన్నాళ్లకు ఆ రహదారికి మహర్దశ పట్టింది. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ కూడలి వరకు 46 కిలోమీటర్ల పొడవున 4 వరుసలుగా విస్తరణ పనులు సాగుతున్నాయి. అందుకు 956 కోట్లతో పనులను ప్రారంభించారు. ఎప్పుడో పదేళ్ల క్రితం మంజూరైన జాతీయ రహదారి ఇది. సకాలంలో విస్తరణ జరగకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానికులు అన్నారు. ఆ రహదారిపై ఏడాదిలో దాదాపు 365మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ రోడ్డుపై రాత్రిళ్లే కాదు పగలు ప్రయాణించాలన్నా అతి కష్టంగా మారిందని చెప్పారు. రహదారి విస్తరణ చేపట్టాలని స్థానికులు పదేపదే మొత్తుకున్నా ఇన్నాళ్లూ పాలకులు చూస్తూ ఉండిపోయారే తప్ప అడుగు ముందుకు పడడం లేదని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కానీ ఇటీవల జరిగిన ఆర్టీసీ బస్సు- టిప్పర్ ప్రమాదంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. దాంతో సత్వరమే మేల్కొని రహదారి విస్తరణకు పచ్చజెండా ఊపాయి. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ కూడలి వరకు 46 కిలోమీటర్ల పొడవున 956 కోట్లతో పనులు ప్రారంభించారు. 18 అండర్ పాస్‌లు, 2 బైపాస్‌లతో రహదారి నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే 156.80 కోట్లు ఖర్చు చేసి 266.55 హెక్టార్ల భూమి సేకరించారని అధికారులు చెప్పారు. ప్రకృతి ప్రేమికులు, పర్యావరణహితులు ఆకాంక్షించినట్లు ఒక్క మర్రి చెట్టు తొలగించకుండానే రహదారి విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయని అన్నారు. వీలైనంత తొందరగా పనులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు. వాస్తవానికి 2022 లోనే ఆ జాతీయరహదారి విస్తరణకు కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ శంకుస్థాపన చేశారు. కానీ దాని వల్ల రోడ్డు పక్కన ఉన్న మర్రిచెట్లకు నష్టం జరుగుతుంది. దాంతో సుమారు 84కు పైగా పక్షి జాతులు మనుగడకు ముప్పు వాటిల్లుతుందని పలు స్వచ్ఛంద సంస్థలు జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. పక్షి మనుగడకు ఎలాంటి ముప్పు వాటిల్లడానికి వీలులేదని రోడ్డు విస్తరణ పనులు నిలిపేశారు. కానీ, ఇటీవల కాలంలో రోడ్డుపై జరుగుతున్న వరుసప్రమాదాలు స్థానికులను తీవ్ర ఆగ్రహానికి గురిచేశాయి. మనుషుల ప్రాణాల కంటే మర్రిచెట్లు ముఖ్యమా అంటూ రాస్తారోకోలు, ధర్నాలు చేశారు. ఇటీవల ఆర్టీసీ బస్సు-టిప్పర్ ఢీకొన్న ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోవడం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఆ ప్రమాదంతో కోర్టు కేసును ఉపసంహరించుకున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మర్రిచెట్లను ట్రాన్స్ లొకేట్ చేయాలని కోరాయి. ఎన్?.హెచ్?.ఏ.ఐ స్వచ్ఛంద సంస్థలకు లిఖిత పూర్వక హామీ ఇవ్వడంతో రహదారి విస్తరణ పనులు జోరందుకున్నాయి. సాధ్యమైనంత త్వరగా విస్తరణ పనులు పూర్తిచేసేలా నిర్మాణ సంస్థ రేయింబవళ్లు పనిచేస్తోందని తెలిపారు. ప్రతి 10 కిలోమీటర్లకు ఒక బృందాన్ని ఏర్పాటు చేసి పనులు సాగిస్తోందని చెప్పారు. ఏడాదిలోపే హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

## అనంత్‌నాగ్ సీఆర్‌పీఎఫ్ క్యాంపులో చిరుత కలకలం



జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో ఇవాళ ఉదయం ఓ చిరుత సీఆర్‌పీఎఫ్ క్యాంపులోకి చొరబడటం తీవ్ర కలకలం సృష్టించింది. కాప్రాన్ ప్రాంతంలో ఉన్న సీఆర్‌పీఎఫ్ శిబిరంలోకి వచ్చిన చిరుత ఒక్కసారిగా సిబ్బందిని భయాందోళనకు గురిచేసింది. ఈ ఘటనలో హెడ్ కానిస్టేబుల్ కమలేశ్వర్ కుమార్‌పై చిరుత దాడి చేయడంతో ఆయన గాయపడ్డారు. వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించగా, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. చికిత్స అనంతరం ఆయన తిరిగి క్యాంప్‌కు చేరుకున్నారు. ఈ ఘటనపై అప్రమత్తమైన అధికారులు వన్యప్రాణి సంరక్షణ శాఖ ఫీల్డ్ సిబ్బందిని రంగంలోకి దింపారు. చిరుతను ఎలాంటి ప్రమాదం లేకుండా పట్టుకుని అడవిలోకి తరలించే చర్యలు ప్రారంభించారు. భద్రతా బలగాలు కూడా క్యాంప్ పరిసరాలను అప్రమత్తంగా ఉంచాయి. ఇటీవల కాలంలో కశ్మీర్ లోయలో మనిషి-వన్యప్రాణి సంఘర్షణ ఘటనలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఉత్తర కాశ్మీర్‌లోని సోపోర్ ప్రాంతంలో ఓ చిరుత గొర్రెల మందపై దాడి చేసి కనీసం ఏడు గొర్రెలను చంపడం, మరికొన్నింటిని గాయపరచడం స్థానికుల్లో భయాన్ని కలిగించింది. దక్షిణ కాశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో చెత్రగామ్ ప్రాంతంలో సెప్టెంబర్‌లో ఎనిమిదేళ్ల బాలుడిపై చిరుత దాడి చేసిన ఘటన కూడా సంచలనం సృష్టించింది. మానవ జనాభా పెరుగుదల, అడవుల తరుగుదల, భూమి వినియోగంలో మార్పుల కారణంగా అడవి జ.ంతువులు గ్రామాలు, పట్టణాల వైపు రావడం ఈ సంఘర్షణలకు ప్రధాన కారణంగా మారుతోంది. పంట నష్టం, పశువుల నష్టం, మానవ గాయాలు, ప్రాణనష్టం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిని నియంత్రించేందుకు అటవీ, వన్యప్రాణి, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# అడవిలో పులిలా ఒంటరి జీవనం

**సరుకుల కోసం ఒక్క రేషన్ కార్డ్**

**ప్రపంచంతో సంబంధం లేకుండా జీవనం**

**పోడు భూమిలో సాగు చేస్తూ జీవనం - జంతువులతో కాలక్షేపం**



చేతిలో సెల్ ఫోన్ లేకుంటే నిమిషం కూడా గడవదు. ఇంట్లో టీవీ, చేతిలో రిమోట్ లేకపోతే కుదురుగా కూర్చోలేం. కాసేపు కరెంటు పోతేనే ఇంటిల్లిపాది చిరాకుపడి పోతుంటారు. అలాంటిది 25 ఏళ్లుగా కరెంట్ లేకుండానే జీవనం సాగిస్తోంది ఆ కుటుంబం. అది కూడా దట్టమైన అడవిలోని ఒక గుడిసెలో. ఆ కుటుంబంలోని ముగ్గురు తప్ప చుట్టు పక్కల మరో మనిషి జాడ కనిపించదు. ఎలాంటి సౌకర్యాలు లేకుండా, తము స్వయంగా పండించుకున్న ఆహారం తింటూ జీవిస్తున్నారు. ఇంతకీ ఈ ముగ్గురు ఎవరు అసలు అడవిలోనే ఎందుకు ఉంటున్నారు ఇప్పుడు తెలుసుకుందాం!భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గోగులపూడికి 15 కిలోమీటర్ల దూరంలో ఎత్తైన కొండపై ఉంది ఈ పూరి గుడిసె. ఇక్కడ సుమారు 40 కొండరెడ్ల కుటుంబాలు ఉండేవి. కానీ ఇదంతా 25 ఏళ్ల క్రితం నాటి సంగతి. ఇప్పుడు ఈ ఒక్క గుడిసె తప్ప ఏమీ లేదు. సుమారు 65 ఏళ్ల వయసు ఉన్న ఇంటి యజమాని రెడ్డయ్య, 60 ఏళ్ల వయసు ఉన్న ఆయన భార్య లక్ష్మి. 45 ఏళ్ల వయసున్న వారి కుమారుడు గంగిరెడ్డి. వీరు ముగ్గురే ఈ కొండరెడ్డి గూడెంలో నివాసం ఉండేది. “ఈ కొండరెడ్డి గూడెం చరిత్ర సుమారు 70-80 ఏళ్ల నాటిది. అప్పట్లో ఈ గూడెం పేరు గోగులపూడి. గ్రామంలో ఎలాంటి మౌలిక వసతులు ఉండేవి కావు. పోనీ ఇక్కడ సౌకర్యాలు కల్పిద్దామా అంటే అందుకు అనువుగా లేని ప్రాంతం ఇది. అందుకే 2000 సంవత్సరంలో భద్రాచలం ఐటీడీఏ అధికారులు ఓ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న కొండరెడ్ల కుటుంబాలను కొత్త కన్నాయిగూడెం సమీపంలోని గోగులపూడికి తరలించారు. అంటే కొండ నుంచి కిందకు తీసుకొచ్చారు. అక్కడే ఇళ్లు నిర్మించి ఇచ్చారు. కానీ, మా కుటుంబం మాత్రం కిందకు వచ్చే ప్రసక్తే లేదని అధికారులకు తేల్చి చెప్పాం. అప్పటి నుంచి ఇప్పటి వరకూ మేం ముగ్గురం ఈ గూడెంలో నివసిస్తున్నాం”. అయితే రెడ్డయ్యకు ఆధార్, రేషన్ కార్డ్?లు లేవు. ఓటు హక్కు కూడా లేదు. మరి ఇవేవీ లేకుండా ఎలా ఉంటున్నారు అంట ఉంటున్నారంతే. ఆహారం ఎలా అని ఆరా తీస్తే వీరి ముగ్గురిలో లక్ష్మికి మాత్రమే రేషన్ కార్డ్ ఉంది. ఏ సరుకులు కావాలన్నా ఈ కార్డే ఆధారం. నెలకు ఓసారి కొండ కిందకు వెళ్లి రేషన్ షాప్ నుంచి బియ్యం తెచ్చుకుంటారు ఈవిడ. పోనీ అప్పుడైనా రెడ్డయ్య, ఆయన కుమారుడు కొండ దిగుతారా అంటే లేదు. ఎలాంటి భయం లేకుండా అడవిలో నడుచుకుంటూ వెళ్లి నేనే సరుకులు తెచ్చుకుంటానని లక్ష్మి చెబుతోంది. ఈ పూరి గుడిసె తప్ప మరో ప్రపంచం వీరికి తెలియదు. కట్టెల పొయ్యిపైనే వంట. కరంట్ లేకున్నా రాత్రి పూట బుడ్డి దీపం పెట్టుకుని నిద్రపోతారు. రెడ్డయ్య, లక్ష్మిల కుమారుడు గంగిరెడ్డికి కట్టెలు కొట్టడమే జీవనోపాధి. వారంతా వాటిని విక్రయిస్తూ వచ్చిన డబ్బుతోనే తృప్తి పడుతున్నారు. “వారికి బయటి ప్రపంచంతో సంబంధం లేదు. వాళ్లకు నాలుగు జతల ఆవులున్నాయి. వీటితో పాటు రెండు ఎద్దులు, మేకలు, కోళ్లు, మూడు కుక్కలు ఉన్నాయి. ఇవే వీళ్లకు ఆస్తులు, నేస్తాలు. ఇక ఇక్కడి పోడు భూమిలో వరి, జొన్న, మొక్కజొన్న, పెసర, కంది లాంటి పంటలు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు”. చాలాసార్లు ఈ కుటుంబాన్ని కొండ నుంచి కిందకు తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు జరిగాయి. కానీ వీళ్లు మాత్రం ససేమిరా అన్నారు. వేరే చోటకు వెళ్లేందుకు అసలు ఇష్టపడడం లేదు. ఈ అడవి, జంతువులు, వ్యవసాయం. ఇంతకు మించి తమకు ఏమీ అక్కర్లేదని తేల్చి చెబుతున్నారు. అంతే కాదు. అసలు అడవిని వదిలి పెట్టి రావడానికి మనసొప్పడం లేదని అంటున్నారు. ఈ రోజుల్లో కూడా ఇలాంటి వాళ్లు ఉన్నారా అనిపిస్తోంది కదూ.

# ఔటర్‌ను కలుపుతూ ఆరు లైన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే

**ఆ ప్రాంతవాసులు వెరీ లక్కీ**

**గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణాలు చేపట్టాలని చూస్తున్న తెలంగాణ ప్రభుత్వం**

**41.50 కిలోమీటర్ల పొడవుతో రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ రహదారి**

**ఏడాదిలోపు నిర్మాణం పూర్తి చేయాలనే యోచనలో హెచ్‌ఎండీఏ**



ఔటర్ రింగ్ రోడ్డుతో ప్రాంతీయ రింగ్ రోడ్డును అనుసంధానించేందుకు ప్రధాన రోడ్డు మార్గాలను అభివృద్ధి చేయడం, విస్తరించడమే కాకుండా కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణాలకు ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే అవుటర్ రింగ్‌రోడ్డు రావిర్యాల జంక్షన్ నుంచి మీర్‌ఖాన్‌పేట, అక్కడి నుంచి అమన్‌గల్ వరకు 41.50 కిలోమీటర్ల పొడవుతో రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. మొత్తం రూ.4,621 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ పనులు ఇప్పటికే ప్రారంభం అయ్యాయి. ఏడాదిలోపు ఈ రహదారిని సిద్ధం చేయాలని హెచ్‌ఎండీఏ భావిస్తోంది. దీంతో పాటు మరో భారీ గ్రీన్‌ఫీల్డ్ రహదారి కోసం ఇప్పటికే హెచ్‌ఎండీఏ కసరత్తు ప్రారంభించింది. బుద్వేల్ నుంచి టీజీఐఐసీ పారిశ్రామిక ప్రాంతాలను కలుపుతూ 167 జాతీయ రహదారి వద్ద కోస్గి వరకు సుమారు 81 కిలోమీటర్ల పొడవుతో నాలుగు లైన్లతో రహదారిని నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. త్వరలో సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేసేందుకు కన్సల్టెంట్‌ను నియమించనుంది. ముందుగా కొత్వాల్‌గూడ నుంచి పరిగి వరకు 55 కిలోమీటర్ల వరకు చేపట్టాలని భావించినప్పటికీ మరికొన్ని ప్రాంతాలను కలుపుతూ ఈ రహదారి విస్తీర్ణం పెంచినట్లు ఓ అధికారి తెలిపారు. ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్‌ఆర్‌ను అనుసంధానించేందుకు మరిన్ని రేడియల్ రహదారులను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. మొత్తం 12-16 వరకు రేడియల్ రోడ్లను చేపట్టాలని యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఓఆర్ఆర్ 22 జంక్షన్ల నుంచి ఉన్న రహదారులను విస్తరించి అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నారు. అన్ని ప్రాంతాలను అనుసంధానించేలా ఎంపిక చేసిన ప్రాంతాల్లో గ్రీన్?ఫీల్డ్ రోడ్లను చేపట్టడం జరగనుంది. భవిష్యత్తు అంతా అవుటర్?, ట్రిపుల్‌ఆర్ మధ్యలో కొత్త నివాస, పారిశ్రామిక, వాణిజ్య ప్రాంతాలు విస్తరించనున్నాయి. ఈ నేపథ్యంలో అన్నివైపులా ఓఆర్ఆర్?, ట్రిపుల్‌ఆర్ వరకు రహదారులను ప్రాధాన్య క్రమంలో నిర్మించాలని చూస్తున్నారు.

**ఆరు లైన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే విశేషాలు :**

మొత్తం గ్రీన్‌ఫీల్డ్ రహదారి పొడవు- 41.50 కిలోమీటర్లు

తొలి దశ- 19.2 కి.మీ(ఓఆర్ఆర్ రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు)

మొత్తం వ్యయం- రూ.1,665 కోట్లు

రెండో దశ- 22.30 కి.మీ (మీర్‌ఖాన్‌పేట నుంచి రీజనల్ రింగ్ రోడ్డు ఆమన్‌గల్ వరకు)

మొత్తం వ్యయం- రూ.2,365 కోట్లు

వెడల్పు- 100 మీటర్లు (యాక్సెస్ కంట్రోల్ ఎక్స్‌ప్రెస్ వే) నిర్మాణం

ఆరు లైన్ల మెయిన్ క్యారేజ్ వే భవిష్యత్తులో 8 లైన్లుగా విస్తరణకు వెసులుబాటుగా భూసేకరణ

మెట్రో/రైల్వే కారిడార్ కోసం అటు ఇటు 20 మీటర్ల వెడల్పుతో భూమి రిజర్వు. పచ్చదనం కోసం 2 మీటర్ల వెడల్పుతో సెంట్రల్ మీడియన్

ఇరువైపులా గ్రీన్‌బెల్ట్, సైకిల్ ట్రాక్, యుటిలిటీ కారిడార్ నిర్మించనున్నారు.

ప్రధాన మౌలిక సదుపాయంగా రోడ్ల నిర్మాణం : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అక్కడ ప్రధానంగా మౌలిక సదుపాయాలు అనేవి ఉండాలి. ఆ మౌలిక సదుపాయాల్లో ప్రధానమైనది రోడ్ల నిర్మాణం. ఎక్కడైతే ఎక్కువ రోడ్ల కనెక్టివిటీలు ఉంటాయో ఆ ప్రాంతం ఎక్కువగా అభివృద్ధి చెందుతున్నట్లు తెలుస్తోంది. అందుకే తెలంగాణలో రోడ్ల కనెక్టివిటీకి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుంది. రోడ్లు ఉంటే చిన్న గ్రామాలతో కూడా కమ్యూనికేషన్ పరంగా, సరకు రవాణా పరంగా ఎక్కువగా చేయవచ్చు. గ్రామాల సీసీ రోడ్లను మండలాల్లోని ప్రధాన రహదారులతో కనెక్ట్ చేస్తే ఇంకా ఎక్కువ ప్రయోజనాలు ఉండనున్నాయి. ఆ మండలాల రహదారులను జిల్లాల్లోని జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తే ప్రజా రవాణాకు, సరకు రవాణాకు ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. అందుకే ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా రోడ్ల విస్తరణ, అభివృద్ధికి వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తూ ఉంటారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com